

సమస్యలపై వినతి



హాజరైన గ్రామస్తులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:లక్ష్మీపురం గ్రామ పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ కొర్ర త్రినాథ్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా అందించే సంక్షేమ పథకాలు అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. ప్రజలు అడిగిన ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానాలు ఇచ్చి సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, నిలిపివేసిన అమ్మఒడిని మంజూరు చేయాలని అధికారులను కోరారు. అర్హులైన వారందరినీ కొత్త ఇల్లులు మంజూరు చేయాలని, పాత ఇల్లులకు బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ వి.సద్దురం మాట్లాడుతూ, డ్రాప్ అవుట్ విద్యార్థులను బడిలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ బి.ప్రశాంత్, ఉప సర్పంచ్ ఎ.సత్యం పాల్గొన్నారు.

బిగిసిన 'ఉక్కు' పిడికిలి

- ఉత్తేజం నింపిన సిపిఎం బహిరంగ సభ
- వేలాదిగా తరలివచ్చిన ఉక్కు కార్మికులు, ప్రజలు
- స్టీల్‌ప్లాంట్‌ను ఐక్య పోరాటాలతో కాపాడుకుంటాం : సీతారాం ఏచూరి, వి.శ్రీనివాసరావు ప్రభృతులు
- బిజెపి కుట్రలపై వైసిపి, టిడిపి, జనసేన మౌనం వీడాలని డిమాండ్



సభా వేదికపై అభివాదం చేస్తున్న సీతారాం ఏచూరి, వి.శ్రీనివాసరావు, సిహెచ్.నర్సింగరావు, లోకనాథం, సురేంద్ర, తదితరులు



భారీగా తరలివచ్చిన జనం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో, గాజువాక

సిపిఎం ఆధ్వర్యాన కూర్మన్నపాలెం సమీపంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద గురువారం జరిగిన ఉక్కు రక్షణ బహిరంగ సభ ప్రజల్లో చైతన్యం నింపింది. ఉత్తరాంధ్ర నుంచి ఈ సభకు వేలాది మంది కార్మికులు, ప్రజలు తరలివచ్చారు. సుదూర ప్రాంతాల నుంచి విభిన్న ప్రభావంతులు, వృద్ధులూ కదిలివచ్చారు. త్యాగాలతో సాధించుకున్న ఉక్కు కర్మాగారాన్ని మోడీ ప్రభుత్వ కుట్రల నుంచి ఐక్య పోరాటాలతో కాపాడుకోవాలని సభా వేదిక నుంచి నేతలు పిలుపునిచ్చారు. 'ఉక్కూ మనదే.. హక్కూ మనదే, విశాఖ ఉక్కు.. ప్రజల హక్కు' అని నేతలు అనగానే ప్రజలూ గొంతు కలిపి బిగ్గరగా నినదించారు. దీంతో ఉక్కు నినాదం పారిశ్రామిక ప్రాంతంలో మార్మోగింది.

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలంటే కేంద్రంలో బిజెపిని 2024 ఎన్నికల్లో ప్రజలు అధికారానికి దూరం పెట్టాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆస్తిని మేనేజర్లుగా వ్యవహరిస్తున్న పాలకులు ఎలా అమ్మేస్తారని ఆయన అనగానే సభలో చప్పట్ల వర్షం కురిసింది.

అంధకారంలోకి దేశం : వి.శ్రీనివాసరావు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అభివృద్ధి నినాదంతో మోడీ అధికారంలోకి వచ్చి దేశాన్ని అంధకారంలోకి నెట్టాడని విమర్శించారు. ఇలాంటి ప్రజా ఉద్యమ సభలతో మోడీ కార్మిక వ్యతిరేక విధానాలకు సమాధానం చెబుతామన్నారు. రాష్ట్రాన్ని అదానీ, అంబానీలకు దోచిపెట్టేందుకు చూస్తున్నారని విమర్శించారు. రూ.3 లక్షల కోట్ల విలువైన స్టీల్‌ప్లాంట్ సంపదపై వారి కళ్లు పడ్డాయని తెలిపారు. రూ.50 వేల కోట్లను ఇప్పటివరకూ స్టీల్‌ప్లాంట్ పన్నుల రూపంలో కేంద్రానికి కట్టిందని, దీన్ని అమ్మే హక్కు బిజెపికి ఎక్కడిదని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో వైసిపి, టిడిపి, జనసేన మౌనం తగదన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ఉరివేస్తానంటే తాడును జగన్ అందిస్తాడా ? అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. జనసేన అధినేత పవన్ తన రెండు చేతుల్లో ఒకదాన్ని టిడిపి, రెండోదాన్ని బిజెపి చేతిలో పెట్టాడని, అక్కడ చేతులు తీసి ప్రజలతో కలిస్తే మంచిదని హితవు పలికారు. ఉత్తరాంధ్ర ప్రజలు ఉత్త ప్రజలు కాదని ఉత్తేజితులై పోరాడితే ఈ ప్రాంతంలో ఎవరూ అడుగుపెట్టలేరని ఆ పార్టీలను హెచ్చరించారు. ఢిల్లీకి బయల్దేరిన సిఎం జగన్ అక్కడ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని అడిగితే ప్రజలు హర్షిస్తారని తెలిపారు. మోడీ విజన్ నచ్చిందంటూ చంద్రబాబు ఆ మధ్య సభలో ప్రకటించారని, ఆయన వినాశకర విజన్ ఎలా నచ్చింది 'బాబూ' అంటూ ప్రశ్నించారు. జగన్ త్వరలో విశాఖలో కాపురానికి వస్తున్నట్లు ప్రకటన చేశారని, విశాఖ ప్రజలు ఆయన రాకకోసం ఎదురు చూడడం లేదన్న సంగతి గుర్తెరగాలని అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా ఏం చేస్తారో అది చెప్పాలని ఇక్కడి వారు అడుగుతున్నారన్నారు. సిపిఎం, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, ప్రజా, కార్మిక సంఘాలు స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం పోరాడుతున్న తీరును అభినందించారు.

ఉక్కును బలహీన పరిచే కుట్రలను తిప్పికొట్టాలి : సిహెచ్.నర్సింగరావు

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను బలహీనపరిచేందుకు కుట్రలు పన్నుతోందని, అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందని అన్నారు. బ్లాస్ట్ ఫర్నేస్ 3ని అత్యంత దారుణంగా మూసివేశారన్నారు. దీంతో ఉత్పత్తి తగ్గి కర్మాగారం నష్టాలోకి వెళ్తోందని అన్నారు. సొంత గనులు లేకపోవడంతో తీవ్ర ఇక్కట్లు ఎదురవుతున్నాయన్నారు. ఎన్ఎండిసి నుంచి గనులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు.

ఉక్కు యాత్రకు ఉత్తరాంధ్రలో విశేష స్పందన : కె.లోకనాథం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ తాము ఉత్తరాంధ్రలో ఉక్కు రక్షణ బైక్ యాత్ర చేసినప్పుడు అన్ని ప్రాంతాల నుంచీ విశేష స్పందన లభించిందన్నారు. రైతులు, విద్యార్థులు మీ పోరాటానికి మేము అండగా ఉన్నామని, తగ్గేది లేదని పేర్కొంటూ స్ఫూర్తినిచ్చారన్నారు. బిజెపి ఎంపి జివిఎల్ నరసింహారావు ఒక బ్రోకర్‌లా వ్యవహరించి విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కుట్రలు పన్నుతున్నారన్నారు. కల్లబొల్లి కబుర్లతో ప్రజలను ఏమార్చాలని చూస్తున్నారని విమర్శించారు.

బిజెపితో అందరికీ నష్టం : కిల్లో సురేంద్ర

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ బిజెపితో ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోందని అన్నారు. మోడీ సర్కారు అటవీ చట్టాల్లో మార్పులు చేసి గిరిజనులకు మనుగడ లేకుండా చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగాన్ని అమ్మకానికి పెట్టడంపై మండిపడ్డారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ విశాఖ ఉక్కుకు విలువ కట్టడానికి వచ్చిన కమిటీ కార్మికుల ఆగ్రహానికి గురై లోపలకు అడుగుపెట్టలేకపోయిందని అన్నారు. అది పోరాట విజయమని పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.ప్రభావతి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే హక్కు మోడీకి లేదన్నారు. సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ ఉక్కు జోలికొచ్చిన వారికి పుట్టగతులుండవన్నారు. సభలో సిపిఎం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శులు టి.సూర్యనారాయణ, రెడ్డి వేణు, డి.గోవిందరావు, ఎం.జగ్గునాయుడు, పి.అప్పలనర్స, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కెఎస్ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, సిపిఎం నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, కెఎం.శ్రీనివాసరావు, బి.జగన్, బి.ఈశ్వరమ్మ, బి.పద్మ, కె.శ్రీనివాసరాజు, స్టీల్ సిఐటియు నాయకులు యు.రామస్వామి, వైటి.దాస్, జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళారూపాలు

సభా వేదికపై ప్రజానాట్య మండలి కళాకారుల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎవ్వరురా అమ్మేది, ఎవ్వడురా కొనేది పాట చైతన్యం రేకెత్తించింది. మహిళా కళాకారుల ప్రదర్శనకు చప్పట్ల వర్షం కురిసింది. ఇటీవల ఉక్కు రక్షణ బైక్ యాత్రలో పాల్గొన్న వారికి అతిథులు మెమెంటోలు అందజేశారు.

భావోద్వేగానికి లోనైన ఏచూరి

సభకు ముఖ్య అతిథిగా హాజరైన సీతారాం ఏచూరి తాను మాట్లాడుతూ ఓ దశలో భావోద్వేగానికి లోనయ్యారు. 'నేను అత్యంత ఉద్వేగపూరితంగా పెరిగాను. అప్పట్లో 'విశాఖ ఉక్కు-మన హక్కు' అంటూ నినాదాలు చేశాం. ప్లాంట్ సాధనలో కమ్యూనిస్టులదే కీలకపాత్ర. ఆ రోజుల్లో పుచ్చలపల్లి సుందరయ్య, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామాలు చేశారు. అలా ఒత్తిడి తేవడంతో వచ్చిందే ఈ ప్లాంట్. ఇది దేశ సంపద. ఏ రాష్ట్రానిదో కాదు. నేను ఆ భవనాలోనే పెరిగి ఇంత పెద్దయ్యాను. మీ ఉక్కు సంకల్పానికి నా బాధ్యత, సహకారం ఎల్లవేళలా ఉంటుంది' అని ఏచూరి చెప్పారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు గిరి పుత్రిక ఎంపిక



దయా మహేశ్వరి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని మారేడుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ముర్ల దయామహేశ్వరి ఎంపికైంది. ఈ మేరకు దయా మహేశ్వరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిఎస్.కుమార్, ఇతర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లో కూడా రాణిస్తూ తమ పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకొస్తున్నారని తెలిపారు. వారికి కావలసిన సౌకర్యాలు అన్ని కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు మంచి శిక్షణ ఇచ్చిన పీడీ పి.శశికాంత్ రెడ్డికి, పిఈటి జయమ్మకు అభినందనలు తెలిపారు. దయా మహేశ్వరి రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చూపి మంచి గుర్తింపు తీసుకొస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు, ముల్లూరు గ్రామస్తులు

ముల్లూరు సమస్యలను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని ముల్లూరు గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని ఆ పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసరావు సర్పంచ్ బొగ్గ వెంకమ్మ, గ్రామస్తులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకమ్మ మాట్లాడుతూ తమ గ్రామాన్ని 41 కాంటూరులో చేర్చి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని, పోలవరం ప్రాజెక్టు ముంపు భూములకు ఇచ్చే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, సంత మార్కెట్ పరిధిలో కొత్త రేకుల షెడ్ నిర్మించాలని కోరారు. డిప్యూటేషన్‌పై ఉన్న టీచర్‌తో పాటు మరో టీచర్‌ను నియమించాలన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయాలని, పాత భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. రేషన్ బియ్యం సరిగా ఇవ్వని వాహనదారుడిని తమ గ్రామ పంచాయతీ నుండి మార్చాలని కోరారు. గిరిజనుల దగ్గర బలవంతంగా విద్యుత్ బిల్లులు కట్టించుకోవడాన్ని ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పాయం శేఖర్, సొడే శ్రీరాములు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఫారెస్టు రేంజ్ ఆఫీసర్

వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి-రంపచోడవరం

వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా రంపచోడవరం మండలం ముసురుమిల్లి జిటిడబ్ల్యు హైస్కూల్‌లో అటవీ అభివృద్ధికి చర్యలు అనే అంశంపై 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన, 8వ తరగతి విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు ఇందుకూరుపేట రేంజ్ ఆఫీసర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చేతుల మీదగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారులు, అటవీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మండలంలో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి 33 కెవి పీడర్‌లో చెట్లు కొమ్మలు నరుకుతున్న కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మారేడుమిల్లి సబ్ స్టేషన్ పరిధిలోని మారేడుమిల్లి, పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఇఇ ఎమ్‌డి యూసఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు దీనికి సహకరించాలని కోరారు.

జమాల్ ఖాన్ ట్రస్టు ఆధ్వర్యాన తాగునీటి బోర్లు ఏర్పాటు

ప్రజాశక్తి-చింతూరు

జమాల్ ఖాన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు జమాల్ ఖాన్ ఒడిశాలోని మల్కనగిరి జిల్లా మోటు తాలూకాలోని వినాయకపురం గ్రామంలో గిరిజనుల తాగునీటి సౌకర్యం నిమిత్తం రెండు తాగునీటి బోర్లను గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పుట్టి పెరిగి గిరిజనులతో మమేకమై ఉన్న గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. తాగునీటి సమస్య ఉండటంతో గ్రామస్తుల కోరిక మేరకు రెండు తాగునీటికి బోర్లను వేయించినట్లు చెప్పారు. మరికొన్ని గిరిజన గ్రామాలను ఎంపిక చేసుకొని మౌలిక సమస్యలను తెలుసుకొని, మరింత సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు జమాల్ ఖాన్ తెలిపారు. కార్యక్రమంలో జెకెసి ట్రస్టు కార్యదర్శి ఎమ్‌డి ఇమ్రాన్ ఖాన్, గ్రామస్తులు పాల్గొన్నారు.



దగ్గరుండి బోరు తీయిస్తున్న జమాల్‌ఖాన్, ట్రస్టు సభ్యులు



మాట్లాడుతున్న కలెక్టర్

అట్రాసిటీ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: అట్రాసిటీ కేసుల సత్వర పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. చింతపల్లి, రంపచోడవరం సబ్ డివిజనల్ పోలీస్ అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ సందర్భంగా అట్రాసిటీ బాధితులకు పరిహారం చెల్లించారా లేదా పరిశీలించి చెల్లించకపోతే చెల్లించడానికి అవసరమైన ప్రతిపాదనలు పంపించాలన్నారు. జిల్లాలో 134 కేసులు ఉన్నాయని పూర్తి స్థాయిలో విచారణ జరిపి చార్జిషీట్ వేయాలన్నారు. పాఠశాలలు, గ్రామ పంచాయతీలలో సివిల్స్ డే కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. సివిల్స్ డే పై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కేసుల పరిష్కారానికి కుల ధృవీకరణ పత్రాలు లేక పోవడంతో ఇబ్బందులున్నాయని పోలీస్ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకుని రావడంతో సానుకూలంగా స్పందించారు. భూ సమస్యలు, వివాహ సమస్యలు ఉంటే కమిటీ దృష్టికి తీసుకుని రావాలని కమిటీ సభ్యులకు సూచించారు. బాధితులకు పింఛన్లు మంజూరు చేయవలసి ఉంటే మండల కమిటీలు ప్రతిపాదనలు పంపిస్తే ప్రభుత్వానికి పంపించి మంజూరు చేయిస్తామన్నారు. ఈ సమావేశంలో పాడేరు ఎ ఎస్‌పి కె.ధీరజ్, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు జి.జనార్ధనరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, కార్మిక శాఖ సహాయ కమీషనర్ టి.సుజాత, రంపచోడవం ఎటిడబ్ల్యూఓ రామ తులసి, ఎస్ డబ్ల్యూ ఓడి. ఎల్.ఆనందరావు, కమిటీ సభ్యులు చెండా లోహితాస్, పలాసి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాత పరీక్ష

ప్రజాశక్తి-పాడేరు:గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈనెల 6న రాత పరీక్ష నిర్వహిస్తామని ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.రాత పరీక్ష స్థానిక లోచలిపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలురు పాఠశాల-1లో 180 మంది బాలురకు, శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో 140 మంది బాలికలకు రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు. రాత పరీక్ష మధ్యాహ్నం మూడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతుందన్నారు. రాత పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పదవ తరగతి లో 10/10 మార్కులు సాధించే విధంగా ప్రత్యేక శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు హుకుంపేటలో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి-పాడేరు:హుకుంపేటలో జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని ఈనెల 6న శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హుకుంపేట ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించే స్పందనకు జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని స్పష్టం చేశారు. స్పందన అనంతరం శాఖాధికారులు సంబంధిత క్షేత్ర స్థాయి సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు.

వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

సిపిఎం నాయకుల డిమాండ్

ప్రజాశక్తి- కూనవరం

వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలోని కోతులగుట్ట సిహెచ్‌సిలో సర్జరీ డాక్టర్‌తో సహా అన్ని విభాగాలు వైద్యులు లేరన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయకుండా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ప్రచార ఆర్భాటాలు చేయటం సిగ్గుచేటన్నారు. వైద్యులు, సిబ్బంది, ఎఎన్ఎంలు వంటి ఖాళీ పోస్టుల సమస్యపై పలుమార్లు అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా వారిలో ఏమాత్రం చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీ ప్రతినిధులు కూడా పట్టించుకోవడం లేదన్నారు. మండల పరిషత్ సమావేశాల్లో సైతం సిపిఎం ప్రజాప్రతినిధులు పలుమార్లు నిలదీసినా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆఖరికి చిన్న పిల్లలకు వేయాల్సిన టీకా కూడా కూనవరం అందుబాటులో లేదన్నారు. మండలంలోని కోపిరిపెట్ట, కారుమానకొండ లాంటి గ్రామాలలో ఏఎన్ఎంలు లేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. సిహెచ్‌సిలకు డాక్టర్లు, సబ్ సెంటర్లకు, ఎఎన్ఎంలను, చిన్నపిల్లలకు టీకాలను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకన్న బాబు, సుధారాణి, వీరబాబు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి, రాయిగూడెం ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్ సెంటర్లలో వ్యాక్సిన్ వేయడానికి ఎఎన్ఎంలు కూడా లేరన్నారు. గ్రామాలకు రహదారుల సౌకర్యం లేక గర్భిణులు, అనారోగ్యానికి గురయ్యే వారు మార్గ మధ్యలోనే ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఇవన్నీ కప్పి పుచ్చుకోవడానికి ఆరోగ్య సురక్ష పేరుతో ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలు చేయటం సిగ్గుచేటన్నారు. మండలంలోని తుమ్మిలేరు, కొల్లూరు తదితర గ్రామాలలో ఏఎన్ఎంలు లేక నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు పంకు సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పూనెం సత్యనారాయణ

నర్సింగపాడు, చుక్కలపాడు, తాటిగొంది గ్రామాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలి

సిపిఎం నాయకులు సురేష్, శ్రీనివాసరావు

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని ఏడుగురాళ్లపల్లి పంచాయతీ పరిధి నరసింగపాడు, చుక్కలపాడు, తాటిగొంది గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, సీనియర్ నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆయా గ్రామాలను సిపిఎం బృందం గురువారం సందర్శించింది. సిపిఎం నాయకులు గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సురేష్, శ్రీనివాసరావు మాట్లాడుతూ పాలకులు మారుతున్నా ఆదివాసీ గ్రామాలు గాని, వారి బతుకులు గాని మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పై మూడు గ్రామాల్లో పాఠశాలలు లేక పిల్లలు తాటిలంక గ్రామంలోని పాఠశాలకు వస్తున్నారన్నారు. వర్షాకాలంలో వాగులు వంకలు దాటుకుంటూ తాటిలంక గ్రామానికి రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వాగుల్లో నీటి ప్రవాహం ఉన్న రోజుల్లో పాఠశాలకు వెళ్లే పరిస్థితి లేదన్నారు. అయినా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా పాఠశాల ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించకుంటే వచ్చే ఎన్నికల సమయంలో ఆయా పార్టీలను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మాజీ జెడ్పీటీసీ ఎం.రంగమ్మ, నాయకులు మల్లం సుబ్బమ్మ, పొడియం లక్ష్మణ్, సవలం కన్నయ్య, సవలం దేశయ్య పాల్గొన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు సురేష్, శ్రీనివాసరావు తదితరులు

వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం అందజేత

ప్రజాశక్తి రంపచోడవరం

రంపచోడవరం గ్రామపంచాయతీ పరిధిలో ఇటీవల మృతి చెందిన మహమ్మద్ అని కుటుంబానికి ఆ గ్రామ సర్పంచ్ మంగా బొజ్జయ్య ఆధ్వర్యంలో వైయస్సార్ బీమా తక్షణ సహాయం కింద పదివేల రూపాయలను గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పులికాంత లక్ష్మి, వివో లీడర్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలి

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు అంగన్వాడీల వినతి



ఐసిడిఎస్ పీడీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - పాడేరు : అంగన్వాడీ సెంటర్లోని గర్భిణులు, బాలింతలకు అమలుచేస్తున్న ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కోరారు. గురువారం పాడేరులో ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగమ్మ, భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు టేక్ హోంంషన్‌లో భాగంగా బాలసంజీవిని, పాలు, గుడ్లు ఇచ్చే సందర్భంలో ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా, అంగన్వాడీ కేంద్రాలకు ఇచ్చిన ఫోన్లు సరిగా పనిచేయక, సిగ్నల్స్, సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. మారుమూల ప్రాంతాల్లో, ఏజెన్సీ మండలాల్లో నెట్ సిగ్నల్ ఉండటం లేదన్నారు. అంతేకాక ఐదో తేదీలోగా ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేయమంటున్నారని, అప్పటికి పాలుగానీ, పోషణ కిట్స్ గానీ అంగన్వాడీలకు రావడమే లేదన్నారు. బెడ్ రెస్ట్ ఉన్న వాళ్ళకు కూడా ఎఫ్ఆర్ఎస్ అమలు చెయ్యాలని బలవంతం చేస్తున్నారన్నారు. దీనివల్ల అంగన్వాడీలకు పనిభారం, మానసిక ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలని కోరారు కార్యక్రమంలో సంఘ కోశాధికారి మంజుల, పలు మండలాల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు

ప్రజా ప్రయోజనాలకు పెద్దపీట

- ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి -పాడేరు: ప్రజ ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యతనిచ్చి, అభివృద్ధి, సంక్షేమ పథకాలను వైసిపి ప్రభుత్వం అమలు చేస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి వెల్లడించారు. గురువారం గుడివాడ గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, లెల్త్ వెల్నెస్ సెంటర్ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు, తాగునీరు సౌకర్యం కల్పన మాత్రమే అభివృద్ధి కాదని, అంతకుమించి ఎన్నో కార్యక్రమాలను వైసిపి ప్రభుత్వం చేపడుతోందన్నారు. పాలనను ప్రజలకు చేరువ చేయడానికి సచివాలయ వ్యవస్థ,వాలంటీర్లు, ప్రజారోగ్యానికి ఆరోగ్యసురక్ష వైద్యశిబిరాలు ఇలా ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పనులను చేపడుతోందన్నారు. ప్రభుత్వం ఎంతో బాధ్యతాయుతంగా ప్రజోపయోగ మంచి పనులు చేపడుతున్నప్పటికీ, విపక్షాలు బురద జల్లే పనులు చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, ఎంపిటిసి చల్లా చిట్టెమ్మ, మండల పార్టీ అధ్యక్షులు సీదరి రాంబాబు, పిఎసిఎస్ చైర్మన్ తమర్భ వెంకటేశ్వర్లు, డిఎంసి చైర్మన్ మినుముల సరస్వతి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు బసవన్న దొర, గబ్బాడ రాజారావు, జిల్లా కార్యదర్శి పసుపుల సత్యనారాయణ, జిల్లా నిర్వాహక కార్యదర్శి శిరగం దశమూర్తి, ఎంపిపి సొనారి రత్నకుమారి, వైస్ ఎంపిపి కుంతూరు కనకాలమ్మ, ఎంపిటిసిలు రామకృష్ణ పాత్రుడు, గిడ్డి విజయలక్ష్మి, ముదిలి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉక్కు రక్షణ బహిరంగ సభకు సిపిఎం బృందం



పాడేరు ఏజెన్సీ నుంచి బహిరంగసభకు బయలుదేరిన సిపిఎం నేతలు

ప్రజాశక్తి -అనంతగిరి : విశాఖ స్టీల్‌పాంట్ పరిరక్షణకు బైకు యాత్ర ముగింపు సందర్భంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహించనున్న ఉక్కు రక్షణ బహిరంగ సభకు అనంతగిరి మండలం నుంచి పెద్దఎత్తున సిపిఎం నేతలు, కార్యకర్తల బృందం తరలివెళ్లింది. సిపిఎమ్‌కు చెందిన అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, అరకు మాజీ జెడ్‌పిటిసి కిల్లో సురేంద్ర, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, టోకూరు సర్పంచ్ కిల్లో.మొస్య, మండల కార్యదర్శి. ఎస్.నాగు, అనంతగిరి, అరకు, డుంబ్రిగుడ, తదితర మండలాలకు చెందిన సిపిఎం నేతలంతా బృందంగా బహిరంగసభకు తరలివెళ్లారు.

బోరు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్, ఎంపిటిసి, ఇతర నేతలు

ప్రజాశక్తి- చింతపల్లి : మండలంలోని లంబసింగి పంచాయతీ చీకటిమామిడి గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు ఎంపీ గొట్టేటి మాధవి నిధులతో మంజూరైన బోరు నిర్మాణానికి గురువారం స్థానికసర్పంచ్ శాంతి కుమారి, ఎంపిటిసి నాగమణి, మాజీ సర్పంచ్ రఘునాథ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. వీరి నాయకత్వంలో మన్య ప్రాంతంలో మారుమూల గిరి గ్రామాలకు రహదారులు, నీటి సమస్యల పరిష్కారం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైసిపి నేతలు రావుల నూకరాజు, నాగరాజు, గోపాల్, వార్డు మెంబర్లు విజయం, జానకి,తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలను మరింత మెరుగుపరచాలి



సూపరెంటిండెంట్‌తో మాట్లాడుతున్న లచ్చన్నదొర

ప్రజాశక్తి- రంపచోడవరం : స్థానిక ఏరియా ఆసుపత్రిలో వైద్యసేవలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, అయినా మరింత మెరుగుపరచాలని ఆదివాసీ గిరిజన సాంస్కృతిక, సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోసు లచ్చన్న దొర అన్నారు. గురువారం ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రి సూపరింటెండెంట్ మారిన తర్వాత వైద్యసేవల్లో గణనీయమైన మార్పు వచ్చిందని, ఆసుపత్రి పరిశుభ్రత మెరుగుపడిందన్నారు అయితే ఖాళీగా ఉన్న రేడియాలజిస్ట్ పోస్టును భర్తీ చేయాలని కోరారు. దీనిపై సూపరింటెండెంట్ స్పందిస్తూ, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానన్నారు.

అరకొర పనులతో అవస్థలు

- అధ్వానంగా రహదారులు
- తారురోడ్డు నిర్మాణం పూర్తయినా, కల్వర్టు, సిసి రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం
- పదేళ్లుగా పట్టించుకోని అధికారులు



బరద వద్ద సిసి రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యంతో అధ్వానంగా తయారైన రోడ్డు

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు: అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల చొరవ లేమితో మారుమూల గ్రామాల గిరిజనులు రాకపోకలకు ఇక్కట్లు తప్పడం లేదు. ప్రభుత్వం కనికరించి, మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పనకు నిధుల మంజూరుచేసినా, అరకొరగా పనులు చేపట్టడంతో పూర్తి ప్రయోజనం లేని పరిస్థితి ఉందని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. తారురోడ్డు నిర్మాణం పూర్తిచేసినా, కల్వర్టులు, మధ్యలో సిమెంట్ రోడ్డు భాగాలను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వల్ల అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, మిగిలిపోయిన పనులను పూర్తి చేయాలని మన్యవాసులు వేడుకుంటున్నారు.

మండల కేంద్రం ముంచంగిపుట్టు నుంచి గుమ్మ సిర్గంపుట్టు మీదుగా బరడ పంచాయతీ కేంద్రం వరకు తారురోడ్డు నిర్మాణం పూర్తయింది. అదే ఇదే రోడ్డు మధ్యలో బరడ సమీపంలో కల్వర్టు, సిర్గంపుట్టు గ్రామ సమీపంలో 50 మీటర్లు, అలాగే బరడ కల్వర్టు వద్ద 30 మీటర్లు రెండు బిట్లుగా సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. తారురోడ్డు నిర్మాణం మొత్తాన్ని పూర్తిచేసిన అధికారులు దాదాపు పదేళ్లుగా కల్వర్టు, సిసిరోడ్డు బిట్లు పూర్తిచేయడంలో మ్రాం ఎందుకనో నిర్లక్ష్యం చూపుతున్నారు. గత ప్రభుత్వహయాంలోనూ, తాజాగా ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనూ ఈ రోడ్డును రెండుదఫాలుగా పునర్నిర్మాణం చేసినా, కల్వర్టు, సిసిబిట్లు మాత్రం కావాలనే వదిలేస్తున్నారని గిరిజనులు మండిపడుతున్నారు. దీంతో రోడ్డు అంతాపూర్తయినా, తమకు రాకపోకల కష్టాలు తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు. పదేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొని ఉండగా, అటు అధికారులుగానీ, నేతలుగానీ దీన్ని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టడం లేదని మండిపడుతున్నారు. దీనిపై పలుమార్లు మొరపెట్టుకుంటే, అదిగో, ఇదిగో అంటూ హామీలిచ్చారే గాని పనులను చేపట్టడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా కల్వర్టు, సిసిరోడ్డు నిర్మాణం పూర్తిచేసి, ముంచంగిపుట్టు, బరడ రోడ్డును పరిపూర్ణం చేయాలని వేడుకుంటున్నారు.

చంద్రబాబు అరెస్ట్‌పై వినూత్న నిరసన




మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి -రంపచోడవరం : రాష్ట్రంలో వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసి జగన్మోహన్ రెడ్డి అరాచక పాలన కొనసాగిస్తున్నారని టిడిపి ఇన్‌చార్జిలు, మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూ రమేష్ మండిపడ్డారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా బాబుతో నేను రిలేదీక్షల్లో భాగంగా టిడిపినేతలకు దండలు వేసి మోకాళ్లపై కూర్చొని నిరసన చేపట్టారు..కార్యక్రమంలో మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు, గురుకు శేషుకుమార్, పాము అర్జున్, మరిపల్ల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంతమోహన్, మట్ట మెహర్‌బాబా గౌడ్, జెఎస్.నగేష్, అడబాల బాపిరాజు, గొర్లె సునీత, షేక్ సుభాన్, కారం సింహాచలం, తైలం గంగాధరరావు, సీతంశెట్టి సీతారామ వెంకటరత్తిరెడ్డి, దాకారపు సత్యనారాయణ, తీగల ప్రభ, పండా బాబి, సిద్దా వెంకన్న దొర, చవలం బాపిరాజు, దిడ్డి జనార్ధన్ కొండ్ల పెదకొండా రెడ్డి, కొరగాని సువర్ణ రాజు, భాస్కర్, కుంజం బాపన్న దొర, కూర తమ్మన్న దొర, క్రి రాజీవ్ సాధల సత్యవతి, పాము రాంబాబు, మడకం పండు దొర, కోసు నాగన్న దొర పాల్గొన్నారు.

క్వాష్ పిటిషన్ వేసే ధైర్యం జగన్‌కు ఉందా? : సివేరి

అరకులోయ రూరల్: తాను లక్షల కోట్ల అవినీతికి పాల్పడలేదని సుప్రీంకోర్టులో క్వాష్ పిటిషన్ వేసే దమ్ము, ధైర్యం జగన్మోహన్ రెడ్డికి ఉందా అని టిడిపి ఎస్టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర ప్రశ్నించారు. గురువారం చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా అరకులోయలో కొనసాగుతున్న నిరసన దీక్షలో పాల్గొని మాట్లాడారు. సంబంధం లేని కేసులో చంద్రబాబును ఇరికించి, సిఐడితో కేసు బనాయించి అరెస్ట్ చేయడం ద్వారా సిఎం జగన్ ఆనందం పొందుతున్నారన్నారు. నేటికీ చంద్రబాబును ఎందుకు అరెస్ట్ చేశారో ఆధారాలు చూపకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బి లక్ష్మి, జగన్నాథం, నీరజా, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దొన్నుదొర

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం



కొత్తవలస ఆరోగ్య సురక్ష శిబిరంలో ఎంపిపి, జెడ్‌పిటిసి

ప్రజాశక్తి -అనంతగిరి : జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరంలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, ఎంపిపి శెట్టి నీలవేణి సూచించారు. గురువారం మండలంలోని ఎగువశోభ పంచాయతీ కొత్తవలస బాలుర పాఠశాలలో ఆరోగ్యసురక్ష వైద్యశిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఐసిడిఎస్ పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రోగులకు ఇబ్బంది పెట్టకుండా వారికి ఆమోదయోగ్యంగా వైద్యసేవలు అందించాలని సూచించారు. ప్రతి రోగిని రిఫర్ చేయకుండా, స్థానికంగా వైద్యసేవలు అందించి వ్యాధి నయం చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కెజిహెచ్‌కు రిఫర్ చేస్తే వెళ్లలేమంటూ మొండికేసిన రోగులను అలాగే వదిలేయకుండా అందుబాటులో ఉన్న ఆస్పత్రిలో వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎగువశోభ సర్పంచ్ కొర్రా సహద్రి, ఆర్ఐ శంకరరావు, స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ జ్ఞానేశర్వి, విశాఖ నుంచి వచ్చిన స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొన్నారు.



కొయ్యూరులో వైద్యసేవలు పరిశీలిస్తున్న ఎంపిపి

కొయ్యూరు : ప్రజలకు మెరుగైన వైద్యసేవలు ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎంపిపి బడుగు రమేష్ అన్నారు. గురువారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రాజేంద్రపాలెం పిహెచ్‌సి వైద్యాధికారి, సిబ్బంది పాల్గొని రోగులకు సేవలుఅందించారు.

చింతపల్లి : మండలంలోని కుడుముసారి పంచాయతీ కోటగున్నల గ్రామంలో సర్పంచ్ బోండా కాంతమ్మ ఆధ్వర్యంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పాఠశాల వద్ద వైద్య శిబిరం, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషకాహార స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లోతుగెడ్డ, కోరుకొండ, చింతపల్లి ఆసుపత్రుల వైద్యులు లక్ష్మీకాంత్, శివ ప్రసాద్, అనిత, చందన శ్రీ వారి సిబ్బందితో పాల్గొని 400 మంది గిరిజనులకు వైద్య సేవలు అందించారు. అవసరమైన రోగులకు రక్త పరీక్షలు నిర్వహించి, రోగ నిర్ధారణ చేసి మందులు పంపిణీ చేశారు. పంచాయతీ వార్డు సభ్యుడు సింహాచలం కార్యక్రమంలో ఎంపిటిసి పార్వతి, డిప్యూటీ తహసిల్దార్ గిడ్డి రాజ్‌కుమార్ ఇఒపిఆర్‌డి శ్రీనివాస్, ఎంఇఒ బోడం నాయుడు, సిడిపిఒ రమణి, పంచాయతీ కార్యదర్శి రాజేష్, ఉపసర్పంచ్ కోటి, హెచ్ఎం సరోజిని, వైసిపి నేతలు అప్పన్న, ఈశ్వరరావు, హరిబాబు, లైకోన్ పాల్గొన్నారు



కుడుముసారిలో ఆరోగ్యసురక్ష వైద్యశిబిరం

పంతలచింత సమస్యలను పరిష్కరించాలి

కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ విభాగం రాష్ట్ర చైర్‌పర్సన్ శాంతకుమారి



ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న శాంతకుమారి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని ఎన్‌హెచ్516 హైవే రోడ్డును ఆనుకొని ఉన్న పంతలచింత గ్రామంలో డ్రైనేజీ, వీధిదీపాలు అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ విభాగం రాష్ట్ర చైర్‌పర్సన్ పి శాంతకుమారి డిమాండ్ చేశారు. గురువారం పంతలచింత సందర్శించి,కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ హైవే రోడ్డు నిర్మించిన అధికారులు డ్రైనేజీ ఏర్పాటు చేయకపోవడం వల్ల గ్రామంలో వర్షపునీరు నిల్వ ఉండి, ఇళ్లలోకి చొరబడుతోందని, ముసురు పట్టినపుడు గ్రామస్తులు పడిన కష్టాలు అంతాఇంతా కాదన్నారు. అంగన్వాడీ భవనం లేకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని, వీధి దీపాల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి వారి పక్షాన పోరాటానికి కాంగ్రెస్ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రతినిధి పి చిన్నస్వామి, మాజీ ఎంపిపి సిహెచ్ సాయిబాబా, ఆదివాసీ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ టి సోమేశ్వరరావు, దొన్ను , గ్రామ మహిళలు పాల్గొన్నారు.

జనసేన బలోపేతానికి కృషి



సమావేశంలో పాల్గొన్న జనసేన నేతలు

ప్రజాశక్తి- విఆర్.పురం: రంపచోడవరం నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ నేతలు అన్నారు. గురువారం విఆర్.పురంలో విఆర్.పురం, కూనవరం మండలాల జనసేన ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు.

విఆర్.పురం, కూనవరం మండలాల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, దాసరి నరేంద్ర అధ్యక్షతన జరిగిన సభలో రంపచోడవరం నాయకులు కుర్ల రాజశేఖర్‌రెడ్డి, మారేడుమిల్లి, చింతూరు మండలాల అధ్యక్షులు మళ్ళా దుర్గాప్రసాద్, మడివి రాజు, కొనకం శ్రీనివాస్, కూనవరం సర్పంచ్ మల్లంపల్లి హేమంత్, వైస్ఎంపీపీ బండారు సాంబశివరావు, మోహన్‌రెడ్డి, అంజనరావు, విజయరామరాజు పవన్, సాయిబాబు, సంతోష్, పండు పాల్గొన్నారు..

కుట్టుశిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండల కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కల్యాణ మండపంలో గిరిజన మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభం కానున్న కుట్టుమిషన్ శిక్షణ తరగతులకు ఈ నెల 7నుంచి 12లోగా దరఖాస్తులను స్వీకరించనున్నట్లు సంఘంమండల అధ్యక్షురాలు సోనియా ఈశ్వరి, కార్యదర్శి సీసా విజయ ఒక ప్రకటనలో తెలిపారు.

మండల పరిధిలోని నిరుద్యోగ యువతులు, గృహిణులు ఎటువంటి విద్యార్హత లేకుండా టైలరింగ్‌లో శిక్షణకు అర్హులని, ఆసక్తి ఉన్నరవాఉ తమ దరఖాస్తులను ఆయా రోజుల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 3గంటలలోగా మండల కేంద్రంలోని శారదా నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు గిరిజన మహిళా సంఘం (ఐద్వా) మండల అధ్యక్షురాలు ఈశ్వరి 7981866928, మండల కార్యదర్శి విజయ 7780197916 మొబైల్ నెంబర్లకు సంప్రదించి పూర్తివివరాలను తెలుసుకోవచ్చని సూచించారు

వృత్తి నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు

ప్రజాశక్తి -పాడేరు : నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గిరిజన నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు స్వీకరణ గడువును ఈ నెల 10 వతేదీ వరకు పొడిగించినట్లు ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, నిర్మాణరంగం, పర్యాటక,ఆతిథ్య రంగం, ప్లంబింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆటోమోటివ్, సెక్యూరిటీ గార్డు, తాపీమేస్త్రి రంగాల్లో అభ్యర్థుల ఆసక్తి మేరకు శిక్షణ అందిస్తారన్నారు. పాడేరు ఏజెన్సీలోని 11 మండలాలకు చెందిన మారుమూల గ్రామాల గిరిజన యువత సంబంధిత మండలాల్లోని ఎంపిడిఒలకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అభ్యర్థి పేరు, తండ్రిపేరు, ఆధార్ నంబరు, చిరునామా, ఇతర పూర్తి వివరాలతో ఎంపిడిఒకు దరఖాస్తులను అందజేయాలని సూచించారు. నిరుద్యోగ గిరిజన యువత వృత్తినైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'కాఫీ' అవార్డు గ్రహీతలకు అభినందన



అవార్డు గ్రహీతలను అభినందిస్తున్న కాఫీ బోర్డు అధికారులు

ప్రజాశక్తి- పాడేరు: పాడేరు ఏజెన్సీలో ఈ ఏడాది ఉత్తమ కాఫీ దిగుబడులు సాధించిన గిరిజన రైతులకు ఫైన్‌కప్ అవార్డులను దక్కించుకున్నారు.గురువారం మినుములూరు కాఫీ బోర్డ్ కార్యాలయంలో అవార్డు గ్రహీతలైన రైతులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. అంతర్జాతీయ కాఫీ దినోత్సవం సందర్భంగా బెంగళూరులో నిర్వహించిన 5వ ప్రపంచ కాఫీ సదస్సు 2023 లో భాగంగా సెంట్రల్ కాఫీ బోర్డు దేశ వ్యాప్తంగా కాఫీ పండించే రాష్ట్రాల నుండి 1755 నమూనాలను సేకరించి పరీక్ష చేయగా, అందులో 134 నమూనాలను ఆంధ్రరాష్ట్రం నుంచే సేకరించారు. ఈ పోటీల్లో అరబిక పార్చ్మెంట్ కేటగిరీలో మొదటి బహుమతిని పెదబయలు మండలం కప్పాడ గ్రామానికి చెందిన కిల్లో అశ్విని సాధించారు. రెండవ బహుమతిని పాడేరు మండలం కనకపుట్టు గ్రామానికి చెందిన రామారావు, 5వ బహుమతిని సంతారి పంచాయతీ కే.తాడిపుట్టు గ్రామానికి చెందిన కుత్తంగి స్వామినాయుడు పొందారు.

అరబిక్ నేచురల్స్ కేటగిరీలోని 5వ బహుమతి డి కొత్తూరు గ్రామానికి చెందిన సంకు అర్జునరావు సాధించారు. పోటీలలో విజేతలుగా నిలిచిన నలుగురు కాఫీ రైతులను కాఫీ బోర్డు సభ్యులు కురస ఉమా మహేశ్వరరావు, కాఫీ బోర్డ్ డిప్యూటీ డైరెక్టర్ సామల రమేష్, ఐటిడిఎ కాఫీ ఎఇఒ జి అప్పలనాయుడు సత్కరించారు. బెంగళూరులో ప్రపంచ కాఫీ సదస్సులో పాల్గొన్న రైతులు తమ అనుభవాలను వివరించారు. ఈ సందర్భంగా కాఫీ రైతులకు ప్రస్తుత కాఫీ సాగు పద్ధతులు, నాణ్యమైన కాఫీ తయారీ, మార్కెటింగ్‌లో మెళకువలను వివరించారు. కాఫీ తాగడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కాఫీ బోర్డు అధికారులు, ఐటిడిఎ సిబ్బంది, కాఫీ రైతులు పాల్గొన్నారు.

రైతు ప్రయోజనకర పనులు చేపట్టాలి

ప్రజాశక్తి -రంపచోడవరం : ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఉపయోగపడే పనులను చేపట్టాలని గ్రామసభలో నిర్ణయించారు. గురువారం మండలంలోని ఫోక్స్‌పేట పంచాయతీలో ఉపాధి పనులపై సమావేశం నిర్వహించారు. ఉప సర్పంచ్ కారం సురేష్‌బాబు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ముదురు తోటలకు కొమ్ములు కత్తిరింపు, ట్రెంచ్‌లు, ఎరువులు వర్మికంపోస్ట్, వేపపిండి, డిఎపి వంటి ఇన్‌పుట్స్ రాయితీపై ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

కండ్రుమ్‌లో గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ హరి

డుంబ్రిగుడ : మండలంలోని కండ్రుం పంచాయతీలో సర్పంచ్ కె హరి అధ్యక్షతన సచివాలయంలో గురు వారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన వివిధ పనులపై, అలాగే పంచాయతీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై వార్డు సభ్యులతో గ్రామసభలో చర్చించి తీర్మానం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎస్.ఆనంద్, వార్డు సభ్యులు, సచివాలయ కార్యదర్శి, సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి అటవీ అనుమతులిప్పించండి



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ చంద్రరావు

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని అంతాడ పంచాయతీ ఎద్దుమామిడి గ్రామానికి రహదారి నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇప్పించాలని సర్పంచ్ సుర్ల చంద్రరావు కోరారు. గురువారం గ్రామస్తులతో కలిసి వెళ్లిఅరకు ఎంపీ గొడ్డేటి మాధవికి వినతిపత్రం అందజేశారు. అటవీశాఖ అభ్యంతరాలతో రోడ్డు పనులు జరగడం లేదని, ఫారెస్ట్ క్లియరెన్స్ ఇప్పించాలని కోరారు. గ్రామంలో పాఠశాల భవనం నిర్మించాలని కోరారు.

23న 'తెలుగుశక్తి' బహిరంగ చర్చావేదిక

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

మంత్రి రోజాపై టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలపై నిజాలను నిర్ధారించుకునేందుకు ఈనెల 23న రామకృష్ణ బీచ్‌లో బహిరంగ చర్చావేదిక నిర్వహిస్తున్నట్లు తెలుగు శక్తి అధ్యక్షుడు బివి. రామ్ తెలిపారు. మహిళల సమక్షంలో నిర్వహించే బహిరంగ చర్చ వేదికకు వచ్చేందుకు బండారు సత్యనారాయణమూర్తి అంగీకరించారన్నారు. మంత్రి రోజాను కూడా ఆహ్వానించామని, ఆమె వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రి రోజా, మాజీ మంత్రి బండారు ఎపిసోడ్‌లో వాస్తవాలను ప్రజలకు తెలియజెప్పేందుకు తెలుగుశక్తి ఆధ్వర్యాన ఈ బహిరంగ చర్చావేదిక నిర్వహిస్తున్నట్లు బివి.రామ్ వెల్లడించారు.

యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

ఉద్యోగ ఉపాధి కల్పనలో విఫలం : సిపిఐ నేత ఈశ్వరయ్య

ప్రజాశక్తి- కలెక్టరేట్(విశాఖ) : కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలుయువశక్తిని నిర్వీర్యం చేస్తున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య మండిపడ్డారు. గురువారం అల్లిపురంలోని మేకా సూరిబాబు భవన్ సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి సమావేశాల ప్రారంభంలో మాట్లాడుతూ, పరిశ్రమలు, ఆస్తులు అమ్మడమే తప్ప, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనలో ప్రస్తుత ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. తొమ్మిదేళ్ల బిజెపి పాలనలో, నాలుగున్నరేళ్ల వైసిపి హయాంలో ఎన్ని పరిశ్రమలను స్థాపించారో, ఎంతమందికి ఉద్యోగావకాశాలు కల్పించారో చెప్పాలని డిమాండ్ చేశారు.